# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 208
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
మే 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## రైతును మోసం చేస్తున్న దళారులు

- వంకాయలు పారబోసి నిరసన తెలిపిన రైతు
- పరకాల మార్కెట్ లో దళారుల దందా



# అధికార పార్టీలో.. వసూల్ రాజా!






- ఎమ్మెల్యే మాటలు సైతం బేఖాతరు
- సదరు లీడర్‌పై సస్పెన్షన్ వేటు పడేనా?
- ఒక్కరి వల్ల పార్టీ ఇమేజీకి డ్యామేజీ?
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఏ నాయకుడు, కార్యకర్త.. ఎవరైనా సరే అక్రమ వసూళ్లు చేస్తే సహించేది లేదని పలు సందర్భాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. కానీ, శాసన సభ్యుడి మాటలను హస్తం పార్టీ లీడర్లు అంతగా సీరియస్ తీసుకుంటున్నట్టు కనిపించడం లేదని పలువురు అంటున్నారు. హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో రైతులకు దారి విషయమై రోడ్డు శాంక్షన్ చేయిస్తానని నమ్మించి ఓ కాంగ్రెస్ నేత అన్నదాతల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్టు తెలుస్తోంది. పైసలు తీసుకున్న తర్వాత పని చేయకుండా కాలం వెల్లదీస్తున్నట్టుగా విశ్వసనీయంగా సమాచారం అందుతోంది. సదరు లీడర్ ఒక్కరి వల్ల పార్టీ ఇమేజీకి డ్యామేజీ అవుతోందని కొందరు భావిస్తున్నారు. అభివృద్ధి పరంగా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే శతవిధాలా ప్రయత్నిస్తున్న సందర్భంలో.. ఈ తరహా నేతల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని కొందరు సదరు పార్టీ నాయకులే పేర్కొంటుండటం గమనార్హం. – వరంగల్ వాయిస్, దామెర



వివరాలు2లో..

# అవినీతికి కేరాఫ్ డోర్నకల్ తహసీల్





- రెవెన్యూ ఆఫీస్ లో అవినితీ ఆఫీసర్
- వసూళ్లకు తెగబడిన అధికారులు
- లింక్ డాక్యుమెంట్ కోసం రూ. 2 వేలు డిమాండ్
- ఫోన్ పే ద్వారా చెల్లించిన బాధితుడు

రెవెన్యూ శాఖ అంటేనే అవినీతి అధికారులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ, సేవల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్న సంఘటనలు నిత్యం మనం చూస్తూనే ఉన్నాం.. తాజాగా డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి తెగబడిన అధికారుల బండారం వెలుగు చూసింది. బాధితుడి నుంచి డబ్బుల డిమాండ్ చేసి ఓ పనికి బదులు మరో పని చేసి చేతులు కాల్చుకున్న అధికారుల తీరుతో అసలు విషయం బయటపడింది. ఈ సంఘటనతో జిల్లాలో అత్యంత అవినీతి పాలిత విభాగంగా రెవెన్యూ శాఖ మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ 'ఏకే సింగ్' స్పందించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

8లో..



2లో..

## గంధం జాతరకు కట్టుదిట్టమైన భద్రత

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్



8లో..

## ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా కాళేశ్వరాన్ని తీర్చిదిద్దాలి

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- పుష్కర స్నానమాచరించిన బండి దంపతులు




# అధికార పార్టీలో.. వసూల్ రాజా!

- ఎమ్మెల్యే మాటలు సైతం బేఖాతరు
- సదరు లీడర్‌పై సస్పెన్షన్ వేటు పడేనా?
- ఒక్కరి వల్ల పార్టీ ఇమేజీకి డ్యామేజీ?
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**వరంగల్ వాయిస్, దామెర :** అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఏ నాయకుడు, కార్యకర్త.. ఎవరైనా సరే అక్రమ వసూళ్లు చేస్తే సహించేది లేదని పలు సందర్భాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. కానీ, శాసన సభ్యుడి మాటలను హస్తం పార్టీ లీడర్లు అంతగా సీరియస్ తీసుకుంటున్నట్టు కనిపించడం లేదని పలువురు అంటున్నారు. హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో రైతులకు దారి విషయమై రోడ్డు శాంక్షన్ చేయిస్తానని నమ్మించి ఓ కాంగ్రెస్ నేత అన్నదాతల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్టు తెలుస్తోంది. పైసలు తీసుకున్న తర్వాత పని చేయకుండా కాలం వెల్లదీస్తున్నట్టుగా విశ్వసనీయంగా సమాచారం అందుతోంది. సదరు లీడర్ ఒక్కరి వల్ల పార్టీ ఇమేజీకి డ్యామేజీ అవుతోందని కొందరు భావిస్తున్నారు. అభివృద్ధి పరంగా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే శతవిధాలా ప్రయత్నిస్తున్న సందర్భంలో.. ఈ తరహా నేతల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని కొందరు సదరు పార్టీ నాయకులే పేర్కొంటుండటం గమనార్హం.

### ఎమ్మెల్యే హెచ్చరికలకూ లెక్కలేదా?

హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో ఓ సంఘటన ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. ప్రజల నమ్మకాన్ని అడ్డుపెట్టుకొని అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా వసూళ్లు చేసిన ఘటనపై గ్రామస్తుల ఆగ్రహం ఉప్పొంగుతోంది. అవినీతి వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇప్పటికే పలు సందర్భాల్లో పార్టీ శ్రేణులను హెచ్చరించారు. “ఎవరు అయినా అక్రమ వసూళ్లు చేస్తే సహించేది లేదు” అని బహిరంగంగానే పలు వేదికల్లో స్పష్టం చేశారు. కానీ ఈ మాటలు వారి పార్టీలోని కొందరికి పట్టనట్టే కనిపిస్తోంది. హట్ టాపిక్ గా ఓ నేత డబ్బుల వసూల్.. తాజాగా దామెర మండలంలో ఓ స్థానిక కాంగ్రెస్ నేత రైతులకు రోడ్డు మంజూరు చేయిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. రైతులు ఆశతో నమ్మినా... డబ్బులు తీసుకున్న తర్వాత పనిచేయకుండా కాలం వెల్లదీస్తూ, వారి గుండెల్లో గుబులు పెంచుతున్నాడని సమాచారం. బాధిత రైతులు ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని యత్నిస్తుండగా, స్థానికంగా ఈ వ్యవహారం పెద్ద దుమారంగా మారుతోంది.

### సదరు నేతతో పార్టీకి నష్టం..

సదరు నేత చర్యలతో పార్టీకి తీవ్ర ఇమేజ్ డ్యామేజ్ జరుగుతోందని, ప్రజల్లో తిరస్కార భావన పెరుగుతోందని కాంగ్రెస్ నాయకులే లోపలగానే చర్చించుకుంటున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభివృద్ధి పనుల్లో నిత్యం తలమునకలై నియోజకవర్గాన్ని ముందుకు నడిపించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్న సమయంలో... ఇలా చెడ్డ పేర్లు తెచ్చే నేతలు పార్టీకి మైనస్‌గా మారుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఎమ్మెల్యే చర్యలు తీసుకునేనా?..

‘నల్లుల వల్ల మంచానికి దెబ్బలు తగిలినట్టు’ పార్టీకి సమీప భవిష్యత్‌లో ఇలాంటి నేతల వ్యవహార సరళి వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. అధికార పార్టీ నేత ఇంత తతంగం నడుపుతున్నా.. ఎమ్మెల్యే ప్రేక్షక పాత్ర పోషించవద్దని, సదరు నేతపై సస్పెన్షన్ వేటు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించాల్సిన సమయం ఆసన్నమైందన్నది రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. పార్టీ పరిరక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న రేవూరి, ఈ వ్యవహారంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



# రైతును మోసం చేస్తున్న దళారులు

- వంకాయలు పారబోసి నిరసన తెలిపిన రైతు
- పరకాల మార్కెట్ లో దళారుల దందా

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలలో రైతులను మోసం చేస్తూ దళారులు దందా కొనసాగిస్తున్నారు. కూరగాయలు పండించే అసలైన రైతులు విక్రయానికి నోచుకోవడం లేదు.
ఆరుగాలం చెమటోడ్చి శ్రమించి తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో కూరగాయలు ఆకుకూరలు పండిస్తే మధ్య దళారులు పండించే రైతు ను మోసం చేస్తూ రైతు వద్ద కొనుగోలు చేసి తిరిగి దళారులకు కమిషన్ పై అమ్ముకుంటున్న పరిస్థితులు హనుమకొండ జిల్లా పరకాల లోని కూరగాయల మార్కెట్ జరుగుతుంది. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తుంది. వందల మంది విక్రయించడానికి మార్కెట్ ఏర్పాటు చేసినా ఫలితం లేదు. తద్వారా అటువైపు వెళ్లే వాహనదారులు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ముచిని పర్తి గ్రామానికి చెందిన ఓ రైతు తనకున్న వ్యవసాయ భూమిలో కూరగాయలు పండిస్తూ అందులో వంకాయలు సాగు చేస్తున్నాడు. కాగా, ఆదివారం రోజు వంకాయలు కోసి దాదాపు ఐదు క్వింటాళ్ల వరకు పరకాల మార్కెట్ కు తీసుకువచ్చారు. కాగా దళారీతో 30 రూపాయలు బేరం చేసుకుని తీసుకోని రాగా పరకాల మార్కెట్ కి రాగానే రూ.10ల చొప్పున కొంటున్నామని ఆలా ఐతే ఇవ్వండని అనడంతో ఆవేదనతో రూ.30 ధర ఇస్తా అని చెప్పి తీరా రాగానే 10 అంటున్నారా అని తనతో తెచ్చిన వంకాయలు కూరగాయల మార్కెట్ లో పారబోసి ఆందోళన చేపట్టారు. రైతుల వద్ద రూ.10లకు కిలో తీసుకొని ప్రజలకు రూ.60లకు కిలో చొప్పున అమ్ముతున్నారా అంటూ ప్రజలు మార్కెట్ దళారులపై మండి పడుతున్నారు.

# రోడ్డు ప్రమాదంపై సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి

- పోలీసులను అప్రమత్తం చేసిన మంత్రి
- గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా




**వరంగల్ వాయిస్, ములుగు :** ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్న రాత్రి మేడారం వన దేవతలను దర్శించుకొని తిరిగి వస్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్ ను ఇసుక లారీ ఢీకొనగా ఇద్దరు మృతి చెందడం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి సీతక్క పోలీసులను అప్రమత్తం చేసి ప్రమాదం గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేస్తూ పోలీస్ అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధిక వేగం తో వెళ్తున్న వాహనాలను నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.



# ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు సీఎం సహాయనిధి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు 3లక్షల 94 వేల 500 రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తుందని ఎంపీ అన్నారు. ఈ సందర్భంగా చెక్కు మంజూరు కోసం సహకారాలు అందించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన పథకాన్ని హనుమకొండ జిల్లాలోని నాలుగు మండలాలలో అక్షయపాత్రకు ఇవ్వాలని నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు హనుమకొండ డీఈఓ వాసంతి సోమవారం సీఐటీయూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులకు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ తో చర్చించి అమలు కాకుండా చర్యలు తీసుకుంటామని, కార్మికులు నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వండి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని హనుమకొండ జిల్లాలో ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం సంతోషకరమని ఆయన తెలిపారు.



# గంధం జాతరకు కట్టుదిట్టమైన భద్రత

## ఈస్ట్ జోన్ డీపీపీ అంకిత్ కుమార్

**వరగల్ వాయిస్, దామెర :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమకొండ జిల్లా మండలం ఓగులాపూర్ లోని సైలని బాబా దర్గాలో ఈనెల 21 నుంచి జరిగే 118 గంధం ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సోమవారం పరిశీలించారు. పార్కింగ్ జాతీయ రహదారితో పాటు గంధం తీసుకొచ్చే క్రమంలో భక్తులను నితంత్రించేలా రోప్ పార్టీ తదితర అంశాలపై దర్గా పీఠాధిపతి, పోలీస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అంకిత్ కుమార్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ పరంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. వీరి వెంట పరకాల ఏసీపీ సతీష్ బాబు, సీఐ రంజిత్ రావు, ఎస్ఐ కొంక అశోక్, దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ షా శైలాని బాబా ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ జి.సంపత్ రావు



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.సంపత్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ సంపత్ రావు స్వీకరించామని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి పోర్టల్ లోని పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని, ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 37 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 10, గృహ నిర్మాణ శాఖకు 09, పెన్షన్ 02, ఉద్యోగం కోసం 01,ఇతర శాఖలకు సంబంధించినవి 15 దరఖాస్తులను స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు సమావేశంలోనే బదిలీచేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారితుల రవి, సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, సివిల్ సప్లై మేనేజర్ రాంపతి, డీఎస్సీఓ అధికారి లక్ష్మణ్ నాయక్, డీసీఓ అధికారి సర్దార్ సింగ్, బీడబ్ల్యూఓ అధికారిని శిరీష, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, విద్యుత్ శాఖ అధికారి నాగేశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్ వివిధ జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాయపర్తి మండలం జగన్నాదపల్లి గ్రామంలో కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ. 2 కోట్ల 90 లక్షల వ్యయంతో నిర్మాణ ప్రారంభానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సి రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత అభివృద్ధికి విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ అత్యంత అవసరం. ఈ సబ్ స్టేషన్ ద్వారా జగన్నదపల్లి సహా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా లభ్యమవుతుంది. ముఖ్యంగా రైతులకు సాగునీటి పంపులు, గృహ వినియోగం, చిన్నతరహా పరిశ్రమలకు అధిక వోల్టేజ్‌తో కూడిన నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. వోల్టేజ్ సమస్యలు తగ్గి, విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి నిర్మాణ పనుల ప్రణాళికలను ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్య నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నాయకులు నంగునూరి అశోక్, కుందూరు విక్రమ్ రెడ్డి, ఎనగందుల మురళి, చిర్ర మల్లయ్య, ఎల్లయ్య, నకిరెడ్డి రాజి రెడ్డి, ముద్రబోయిన వెంకన్న మహిళ నాయకులు, యువజన నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# గోదాంను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల వ్యవసాయ మార్కెట్లో 2వేల మెట్రిక్ టన్నుల నిలువ చేసే ధాన్యపు బస్తాల గోదాంను పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు జరగకుండా న్యాయంగా పనిచేయాలని, అలాగే ఇబ్బందులు రాకుండా చూడాలని అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు దాసరి భిక్షపతి, బొమ్మకంటి రుద్రమదేవి చంద్రమౌళి, నల్లెల్ల కుమారస్వామి, మేనేజర్ రాజు, హమాలి యూనియన్ గౌరవ అధ్యక్షుడు లంకదాసరి అశోక్, మార్కెట్ సిబ్బంది రాజేష్ పెద్ద ఎత్తున హమాలి సంఘం యూనియన్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కుంకుమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే రేవూరి పూజలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని శ్రీ భవానీ కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ కుంకుమేశ్వర స్వామికి అన్నార్చన మహా రుద్రాభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హనుమాన్ దీక్ష దారులకు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నదానం చేశారు.



# కోటగుళ్లలో కోడూరు నవీన్ కుమార్ దంపతుల పూజలు

◆ గోశాల నిర్వహణకు రూ. 56 వేల వితరణ



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోడూరు నవీన్ కుమార్, సుమతి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం గోశాల నిర్వహణలో భాగంగా పనిచేస్తున్న పానిగంటి గణేష్ కు వేతనం కింద రూ.56 వేలను అందజేశారు. ఈ సందర్భంగా గోశాల గోమాతలకు నవీన్ కుమార్ సుమతి దంపతులు పండ్లను అందజేశారు. అనంతరం డాక్టర్ దంపతులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గోశాల నిర్వహణకు వేతనాన్ని అందజేసిన నవీన్ కుమార్ సుమతి దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# సబ్సిడీపై జీలుగ విత్తనాలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** భూసారం పెంపు కోసం రైతులు పచ్చిరొట్ట ఎరువుగా వాడే జీలుగ విత్తనాలను సబ్సిడీ పై అందిస్తున్నామని నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. నార్లాపూర్ గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 30 కిలోల బ్యాగుకు సబ్సిడీ పోను రైతు వాటా కింద రూ. 2137.50 చెల్లించి తీసుకోవాలని తెలిపారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులను వ్యవసాయ విస్తరణాధికారి వద్ద సమర్పించి జీలుగ విత్తనాలు తీసుకోవాలని తెలిపారు.

# డీఈవోపై చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం వినతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు అనుమతిలుస్తున్న హనుమకొండ డీఈవో వాసంతిపై చర్యలు తీసుకోవాలని సోమవారం హనుమకొండ కలెక్టర్ ఆఫీసులో పీడీఎస్ యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్ కుమార్ మాట్లాడుతూ హసన్ పర్తి పరిధిలో డీఈఓ వాసంతి రీజొనన్స్ పబ్లిక్ స్కూల్ పేరుతో ఓపెనింగ్ పర్మిషన్ అనుమతి ఇచ్చారని అన్నారు. హైస్కూల్ పేరుతో ఇవ్వాల్సిన అనుమతి పబ్లిక్ స్కూల్ పేరుతో ఇచ్చారన్నారు. అంతేకాకుండా నిబంధనలకు భిన్నంగా ఉన్న కూడా డీఈఓ అనుమతులు ఇచ్చారని, ఈ విషయమై మేము డీఈఓని కలిసి అడిగితే నా ఇష్టం అని దురుసుగా సమాధానం ఇచ్చిందని, నా మీద అనేక ఎంక్వయిరీలు పెండింగ్ లో ఉన్నాయని నేను మీకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పిందన్నారు. తక్షణం రీజొనన్స్ పబ్లిక్ స్కూల్ పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దుచేసి డీఈవో వాసంతి పైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు ముషరాఫ్ శంకర్, గణేష్,నాని తదితరులు ఇతరులు పాల్గొన్నారు.

# నిమ్మల రాజేష్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం టూరిజం మేనేజ్ మెంట్ పరిశోధకులు నిమ్మల రాజేష్ కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది .హిస్టారికల్ మోనుమేంట్స్ ఇన్ నార్త్ తెలంగాణ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ టూరిజం-ఏ స్టడీ అనే అంశంపై టూరిజం మేనేజ్ మెంట్ అండ్ హిస్టరీ ఆచార్యులు తక్కళ్లపల్లి దయాకర్ రావు పర్యవేక్షణలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ సందర్భంగా నిమ్మల రాజేష్ ను ఆ విభాగం అధ్యాపకులు, పరిశోధకులు అభినందించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ



**వరంగల్ వాయిస్, బల్దియా :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ వహించి వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. మొత్తం 99 ఫిర్యాదుల అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఏంహెచ్ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# మా స్థలం.. మాకివ్వండి



## ◆ కలెక్టరేట్ ఎదుట వడ్డెరుల ఆందోళన

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టరేట్ ఎదుట జంగిలిగొండ వడ్డెర సామాజిక సంఘానికి చెందిన సభ్యులు సోమవారం ఉదయం బైఠాయించి ఆందోళనకు దిగారు. వడ్డెరులు సంచార జీవన విధానాన్ని అనుసరించే సామాజిక వర్గంగా ఉండగా, వారికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి వెంకన్న మాట్లాడుతూ, “2008లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతితో మా వర్గానికి చెందిన కుటుంబాలు కలిసి మహబూబాబాద్ పట్టణంలోని సర్వే నెంబర్ 210లో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేశాము. ఈ భూమిని 124 వడ్డెర కుటుంబాలకు 124 చదరపు గజాల చొప్పున రెవిన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారు. అక్కడే హద్దురాళ్లను కూడా ఏర్పాటు చేశారన్నారు. అలాగే, 2018లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ పాలనలో కోటి 26 లక్షల రూపాయలు మంజూరు చేసి, ఆ భూమిలో రెండు రూముల ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయించిందన్నారు. అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అయితే, తమ సామాజిక వర్గానికి కేటాయించిన స్థలంలో ఇప్పుడు విద్యుత్ సబ్‌స్టేషన్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలు నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. “మేము ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి మా స్థలంలో ప్రభుత్వ ప్రాజెక్టులు నడుస్తున్నాయన్నారు. దీనిపై ప్రశ్నించగా, అధికారులు మాకు మరో 6 ఎకరాలు కేటాయిస్తామని చెప్పినప్పటికీ, అది ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. తమ వర్గ దైవమైన రేణుక ఎల్లమ్మ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేసినందుకు తమపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని వెంకన్న ఆరోపించారు. “ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులు స్పందించి, మాకు కేటాయించిన అసలు స్థలంలోనే ఇండ్లను నిర్మించి, న్యాయం చేయాలని వడ్డెర సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వడ్డెర సంఘానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని రైతు సోదరులకు ఒక ముఖ్యమైన సమాచారం –రైతుల పంట పొలాల్లో నేల సారవంతాన్ని మెరుగుపరచడానికీ, భూసారాన్ని పునరుద్ధరించడానికీ సహాయపడే పచ్చిరొట్టె ఎరువులుగా పరిగణించబడే జీలుగ, జనుము విత్తనాలను తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై అందుబాటులోకి తీసుకువచ్చిందని దామెర మండల వ్యవసాయ అధికారి అల్లె రాకేష్ తెలిపారు. ఈ విత్తనాలు హనుమకొండ మండలంలోని వడ్డేపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ ధరలతో లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు (30 కిలోల బ్యాగు) రైతు వాటా రూ. 2137.50 కాగా, జనుము విత్తనాలు (40 కిలోల బ్యాగు) రైతు వాటా రూ.2510.00 అని తెలిపారు. విత్తనాలను పొందాలనుకునే రైతులు తప్పనిసరిగా తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డును సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. అటుపై, జీలుగ విత్తనాల కోసం పర్మిట్ పొందిన అనంతరం వడ్డేపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలను తీసుకోవచ్చన్నారు. రైతుల సౌకర్యార్థం ఊరుగొండ సొసైటీ ద్వారా కూడా ఈ విత్తనాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ అధికారి అల్లె రాకేష్ తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని భూమి సారవంతాన్ని మెరుగుపరచుకోవాలని కోరుతున్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ పరిధిలోని 4 వ వార్డులో విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకుడు, కార్పెంటర్ దెంచనాధుల సాంబయ్య సతీమణి దెంచనాధుల చంద్రకళ ఆదివారం సాయంత్రం సమయంలో అకాలమరణం చెందారు. దీంతో సోమవారం ఉదయం 7:00 గంటలకు పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ బ్రదర్స్ దెంచనాధుల చంద్రకళ పార్ధివదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డుకు సంబందించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సంగి పరమేశ్వర్ గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పరకాల బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సంగి పరమేశ్వర్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, సరైన సమయంలో డాక్టర్ సలహాలతో మందులు వాడాలని, నాణ్యమైన ఫుడ్ తీసుకోవాలని సూచించారు. వారి వెంట మడికొండ శ్రీను, దుబాసి తిరుపతి, ఆర్టిస్ట్ కోటి, ప్రవీణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా శిబిరం ముగింపు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరం నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ ఈ శిబిరం విద్యార్థులలోని ప్రత్యేక నైపుణ్యాలను మెరుగుపరచడానికి అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థి హరిప్రసాద్ మాట్లాడుతూ, ఈ శిబిరం వల్ల విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా జీవన నైపుణ్యాల గురించి అవగాహన పొందారని అన్నారు. చివరి రోజున, విద్యార్థుల కోసం క్రికెట్, క్యారమ్స్, స్కిప్పింగ్, డ్రాయింగ్, సాంగ్స్, డాన్స్ స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# ఘనంగా విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం

## ■ హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మండలంలోని సముద్రాల గ్రామంలో నూతనంగా నిర్మించిన మహంకాళి అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన, పోచమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీకి, ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మహంకాళి అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణలతో అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపైన ఉండాలని, ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నారు. ఇంత గొప్పగా ఆలయాన్ని నిర్మించడానికి సహకరించిన సోమిరెడ్డికి, ఆలయ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్యకుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. సముద్రాల గ్రామ పరిధిలోని నారాయణపల్లెలో 33/11కేవి సబ్ స్టేషన్ నిర్మాణం చేసుకోబోతున్నామని, దింతో సముద్రాల గ్రామానికి ఎలాంటి విద్యుత్ సమస్యలు, విద్యుత్ అంతరాయం ఉండబోదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# మానుకోట జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

**వరంగల్,వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లాలో పలువురు తహసీల్దార్లకు వివిధ మండలాల్లో పోస్టింగులు కల్పిస్తూ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన నలుగురు తహసీల్దారులు శనివారం కలెక్టరేట్ లో రిపోర్ట్ చేశారు. చంద్రశేఖర్ ను గూడూరు నుంచి మహబూబాబాద్ కు బదిలీ చేశారు. నాగరాజు నర్సింహులపేట నుంచి బయ్యారం మండలానికి, బయ్యారం నుంచి విజయను కురవి, రాజును నెల్లికుదురు నుంచి కొత్తగూడ బదిలీ చేశారు. డోర్నకల్ నుంచి కె.కృష్ణవేణిని మరిపెడకు బదిలీ చేశారు. ఇటీవల ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు సీహెచ్.నరేష్ ను నెల్లికుదురు, జి.వివేక్ ను కేసముద్రం, జి.రమేష్ బాబు నర్సింహులపేట, ఎం.ఇమ్మానుయేల్ ను డోర్నకల్, ఎన్.నాగభవానీని గూడూరు, ఎ.పున్నంచందర్ ను సీరోలు తహసీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

## డోర్నకల్ మండల తహసీల్దార్‌గా ఇమ్మానుయేల్..

స్థానిక మండల తహసీల్దార్ గా మేకల ఇమ్మానుయేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1993లో ఏటూర్ నాగారం ట్రైబల్ వెల్ఫేర్ లో జూనియర్ అసిస్టెంట్ గా రెవెన్యూ సర్వీస్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన తర్వాత నర్సింహులపేట చిన్నగూడూరు, మహబూబాబాద్, బయ్యారం, గుండాల, కురవి, మరిపెడ మండలాల్లో తహసీల్దార్ గా విధులు నిర్వహించి ఎన్నికల ముందు మణుగూరు మండల తహసీల్దార్ గా బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి డోర్నకల్ మండల తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. నిన్నటి వరకు డోర్నకల్ మండలంలో ఎమ్మార్వోగా నిర్వహించి పలు ఆరోపణలు ఎదుర్కొన్న కృష్ణవేణి మరిపెడకు బదిలీ ఆయ్యారు.



# ఆదరణ చూసి ఓర్వలేక ఆరోపణలు

- సన్న బియ్యం పథకంతో దేశవ్యాప్త గుర్తింపు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** ప్రజల్లో తమకు పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఓర్వలేక పోతున్నాడని దాంట్లో భాగంగానే నిరాధారపు ఆరోపణలు చేసి మరోసారి సోషల్ మీడియాలో హైలెట్ కావాలని చూస్తున్నాడని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల్, గూడూరు, భీంపెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం కమలాపూర్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని 36 మంది లబ్దిదారులకు 14,45,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్టాపన, నవగ్రహ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ అనేక స్కాంలు చేస్తే ఏడాదిన్నరలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే స్కీములను ప్రవేశపెట్టి ప్రజల ఆదరణ పొందిందన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో త్వరలో రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. కరీంనగర్ సాక్షిగా హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడారని రెండేళ్లు ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్ గా పనిచేసి కనీసం కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పంచలేని అసమర్థుడు కౌశిక్ రెడ్డి అని మండిపడ్డారు. ఇటీవల కమలాపూర్ మండల కేంద్రంలో డబ్బులు డిమాండ్ చేసిందని పోలీస్ స్టేషన్ దాకా వెళ్లారని, ఏ పథకం చేపట్టిన ఆ పథకం స్కాం అంటున్న



కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించడం లేదని, పచ్చకామర్లు వస్తే అంతా పచ్చగా కనబడుతున్నట్టు స్కాంలో మునిగితేలిన బీఆర్ఎస్ పార్టీకి స్కాంములు అనే లోకం తప్ప మరేమీ కనబడడం లేదని అన్నారు.ఈ సందర్భంగా రెండేళ్లుగా ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పంచాడో రుజువు చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు నియోజవర్గానికి 3500 ఇల్లు కేటాయించిందని అవి ప్రారంభ దశలో ఉన్నాయని ఆధారాలు కావాలంటే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాల్లో పునాది వరకు నిర్మించారని వారికి లక్ష రూపాయల వరకు సహాయం కూడా అందిందని కావాలంటే ఆ గ్రామాలకు వెళ్లి చూడొచ్చని అన్నారు. రాబోయే రెండు మూడు నెలల్లో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం అవుతాయని అన్నారు. ప్రతిపక్ష నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ, బోనస్ ద్వారా ఏ విధంగా లబ్దిపొందారో స్వయంగా తమ సంతోషాన్ని చెప్తున్నారని అన్నారు. పబ్లిసిటీ కోసం డ్రామాలు చేస్తూ తిరగడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పని ఏరోజు చేయలేదని అంతగా రీల్స్ చేయాలనుకుంటే హైదరాబాదులో రీల్స్ చేసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి లైకులు పొందాలని ఎద్దేవా చేశారు. ఇలాంటి చిల్లర మల్లర ఆరోపణలు మరొకసారి చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ-రవీందర్, మార్కెట్ డైరెక్టర్లు, మండల స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యూఐ మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

■ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు, డీఆర్డిఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యల పై అర్జీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి వారి సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. పరిష్కరించలేని దరఖాస్తులను అందుకు కారణాలను దరఖాస్తుదారుడికి తెలియపరచాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారుల సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖల వారీగా 128 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ సమస్యలపై 54, పీడీడి హౌసింగ్ మున్సిపాలిటీ-7, దరఖాస్తులు రాగా, మిగతా శాఖలకు ఆసంబంధించిన 46దరకాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సమస్య తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 86 వినతులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అందించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 86 వినతులను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ ఆ సమస్యలపై పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు దారులకు సీనియర్ సిటిజన్ కమిటీ సేవలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి వారం సోమవారం జరుగుతున్నప్రజావాణిలో ఫిర్యాదులు చేసేందుకు వచ్చే ప్రజల సౌకార్యర్థం నేడు సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్లు అయిన కే. మల్లారెడ్డి. డాక్టర్.ఆడెపు. రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ తదితరులు వినతి పత్రాలు రాసి ఇస్తున్నారు.



## బీటెక్ విద్యార్థినికి విద్య ఫౌండేషన్ చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డేపల్లి, ప్రైమరీ హెల్త్ సెంటర్ కు సమీపంలో నివాసం ఉంటున్న కోమల్ల భవ్య శ్రీ విద్యార్థిని కి కళాశాల లైబ్రరీ ఫీజు నిమిత్తం రూ. 10,000/- లను విద్యఫౌండేషన్ సభ్యురాలు వేదాంతం లక్ష్మి అందజేశారు. తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, హైదరాబాదు లో బీటెక్ రెండవ సంవత్సరం చదువుచున్న నిరుపేద విద్యార్థి భవ్య శ్రీ ఆర్థిక పరిస్థితులను గమనించి ఈ మేరకు సహాయం అందించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి కలకోట్ల నరేందర్, సభ్యులు వెల్దండి లీల, టి.నర్సింగరావు, కాంచనపల్లి అనిత కొక్కుల కృష్ణ, కూరపాటి రమేష్, వసంత తదితరులు పాల్గొన్నారు

## ఐ షైన్ ప్లే స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, సుబేదారి:** నగరంలోని సుబేదారిలో డా.వేణు యాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ షైన్ కిడ్స్ ప్లే స్కూల్ ను ముఖ్య అతిథులుగా హాజరై పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలానుగుణంలో చిన్నారులకు బాహ్య ప్రపంచానికి తొలి అడుగు ప్లే స్కూల్ అని పాఠశాలకు వచ్చే చిన్నారులు సొంత పిల్లల మాదిరి చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ జిల్లా అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, నాయకులు పాల్గొన్నారు.

## నేషనల్ ఓబీసీ రెండు నియోజకవర్గాల ఇంచార్జిగా తురాయి రజిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ ఓబీసీ హనుమకొండ వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిగా వరంగల్ బ్యాంక్ కాలనీకి చెందిన తురాయి రజినిని నియమిస్తూ ఓబీసీ నేషనల్ కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, నేషనల్ ఓబీసీ కమిటీ వైస్ చైర్ పర్సన్ శ్రీనివాసచారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి ఓబీసీ ఇంచార్జిగా నియమించడం పట్ల తురాయి రజిని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. హనుమకొండ, వరంగల్ నియోజకవర్గం ఓబీసీల బలోపేతానికి కృషి చేస్తూ తాను నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఓబీసీ కమిటీ పెద్దలకు, హనుమకొండ, వరంగల్ నియోజకవర్గ ఓబీసీ బంధుమిత్రులకు రజనీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 19 మే 2025 7

# చిరుతో మరోసారి..



ఒక్కోసారి అలా అలా జరిగిపోతుంది. అయితే దేనికైనా టైమ్ రావాలి... అంతే! అగ్ర కథానాయకుడు చిరంజీవి , దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఒక కొత్త సినిమా పట్టాలెక్కిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథానాయికగా నయనతార నటించనున్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ వార్తలను నిజం చేస్తూ.. నయనతార కథానాయికగా నటిస్తున్నారని టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఓ ఆసక్తికర వీడియోను ఈ సందర్భంగా పంచుకుంది. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారని చెప్పింది. ఒక ఆసక్తికర వీడియోను పంచుకుంది. వీడియో చివర్లో చిరంజీవి మేనరిజంలో 'హలో మాస్టారు.. కెమెరా కొద్దిగా రైట్ టర్నింగ్ ఇచ్చుకోమ్మా ' అంటూ ఆమె చెప్పిన సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీమ్‌లోకి ఆమెను స్వాగతిస్తూ చిరు సైతం పోస్టు పెట్టారు. హ్యాట్రిక్ మూవీకి స్వాగతం. ఆమెతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' తర్వాత చిరు – నయన్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది. తనదైన మార్క్ కామెడీ, యాక్షన్‌తో అనిల్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సాహు గారపాటి, చిరంజీవి తనయ సుస్మిత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు.. ఇందులో తన అసలు పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో నటించనున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు కనిపించే అవకాశం ఉందని ఓ పాత్ర కోసం అదితిరావు హైదరిని సంప్రదించారని సమాచారం. భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది



## నటుడు జూనియర్ ఎన్టీఆర్ మనోగతం

జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వత దేవర–2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే త్రిబుల్ ఆర్ కాన్సర్ట్ లో పాల్గొని వచ్చాడు. ఇప్పుడు కర్ణాటకలో డ్రాగన్ షూటింగ్ లో పాల్గొంటు–న్నాడు.

# కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు

## తెరంగేట్రానికి సిద్ధంగా రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు అరంగేట్రం చేయబోతున్నాడు. పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారని, గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోషల్ మీడియాలో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ బయటకు రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. బ్లాక్‌సూట్‌లో మెస్మరైజింగ్‌లో లుక్‌లో కనిపించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా జయకృష్ణ లండన్‌లో నటనలో ప్రొఫెషనల్ –ట్రైనింగ్ తీసుకున్నాడు. అయితే తాజాగా జయకృష్ణను తెలుగు చిత్రసీమలో ఆవిష్కరించేందుకు దర్శకుడు సిద్ధం అయ్యాడు. ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి చిత్రాలతో బోల్డ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ ఎంట్రీ ఇవ్వనున్నట్లు– సమాచారం. వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. అంటే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇద్దరు ప్రముఖ నిర్మాతలు సంయుక్తంగా నిర్మించనున్నారని తెలుస్తోంది. అయితే అజయ్ భూపతి మాత్రం ప్రస్తుతం 'మంగళవారం 2'తో బిజీగా ఉన్నప్పటికీ, జయకృష్ణ డెబ్యూ సినిమాను కూడా త్వరలో సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడట. కాగా ఈ సినిమా కథ యాక్షన్, ఎమోషన్ తో యువతను ఆకర్షించేలా ఉంటుందని అంటున్నారు. అంతే కాదు మహేష్ బాబు ఈ ప్రాజెక్ట్‌ను దగ్గరుండి చూస్తూ, కొన్ని నిర్మాణ అంశాల్లో కీలక సలహాలు ఇస్తున్నాడని సమాచారం.



# ఆర్ముగ్‌కుమార్ ఆదుకోవడంతోనే ఈ స్థాయిలో ఉన్నా


## తమిళ నటుడు విజయ్ సేతుపతి వెల్లడి



తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. విలక్షణ నటుడిగా అన్ని భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా ఎలాంటి పాత్ర అయిన పడిరచగల సతా ఉన్నవాడు. ముఖ్యంగా విలన్‌గా విజయ్ యాక్టింగ్‌కి విపరీతమైనా ఫ్యాన్ ఫాలోయింద్ ఉంది. విజయ్ మాట్లాడుతూ.. ' కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే తెలుసుకున్న నేను డైలాగులు కూడా రాయగలనని. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు. అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది. అలాగే క్లాసిక్ మూవీ '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోడు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటింది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.

# రాజ్-సమంతల వ్యవహారం


## ఆసక్తి రేపుతోన్న రాజ్ భార్య పోస్ట్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి రోజుకో న్యూస్ వైరల్ అవుతూనే ఉంది. మూవీస్ విషయం పక్కన పెడితే ఎక్కువగా తన వ్యక్తిగత విషయాలు ఏదో ఓ రూమర్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇక సామ్ రెండో పెళ్లికి సిద్ధమైనట్లు, దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె ప్రేమలో పడిరదని, గత కొంతకాలంగా ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియాలో వరుస వార్తలు ప్రచారం అవుతున్నాయి. సమంత ఎక్కడ ఉంటే అక్కడ రాజ్ ఉంటున్నాడు.దీంతో నెట్టింట ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే విపరీతంగా చర్చ నడుస్తోంది. ఈ రూమర్స్‌పై సమంతగానీ, రాజ్ గానీ ప్రత్యక్షంగా స్పందించలేదు. కానీ రాజ్ నిడిమోరు భార్య శ్యామలి దే పెడుతున్న పోస్టులు చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా ఆమె పెట్టిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. 'మంచి కర్మను సృష్టించండి. ప్రజలకు సాయం చేయండి. అందరితో న్యాయంగా వ్యవహరించండి' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు పెట్టింది. అంతకు ముందు 'నా గురించి మాట్లాడేవారికి.. నా తరఫున మాట్లాడేవారికి.. నేను చెప్పేది వినేవారికి.. నా గురించి వార్తలు వినేవారికి.. నా గురించి రాసే వారికి.. నా కోసం ఆలోచించేవారందరికీ దేవుడు ఆశీర్వాదం, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నా' అనే పోస్ట్‌ను ఆమె షేర్ చేసింది. దీంతో ఆమె వీరిద్దరిని ఉద్దేశించే పెడుతున్నట్లు–గా కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# అవినీతికి కేరాఫ్ డోర్నకల్ తహసీల్

- రెవెన్యూ ఆఫీస్ లో అవినితీ ఆఫీసర్
- వసూళ్లకు తెగబడిన అధికారులు
- లింక్ డాక్యుమెంట్ కోసం రూ. 2 వేలు డిమాండ్
- ఫోన్ పే ద్వారా చెల్లించిన బాధితుడు






**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** హబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బానోత్ లాల్ గృహనిర్మాణం కోసం చేసిన ప్రయత్నం ఒక అవినీతి వ్యవస్థ ముఖచిత్రంగా మారింది. నూతనంగా ఇంటి నిర్మాణానికి అవసరమైన హౌసింగ్ లోన్ కోసం బ్యాంక్‌ను సంప్రదించిన లాల్, బ్యాంక్ అధికారుల సూచన మేరకు లింక్ డాక్యుమెంట్ల కోసం డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయం మెట్లెక్కాడు. కానీ అక్కడ అతనికి ఎదురైన అనుభవం ప్రభుత్వ వ్యవస్థపై ఎన్నో ప్రశ్నలు రేపుతోంది.

### లింక్ డాక్యుమెంట్ల పేరుతో లంచాల బాదుడు..

1995 సంవత్సరం నుంచి డోర్నకల్ పట్టణానికి సంబంధించి లింక్ డాక్యుమెంట్లు కావాలని లాల్, రికార్డు అసిస్టెంట్ నాగరాజును కలిశారు. నాగరాజు చెప్పిన దానిపై లాలు డిప్యూటీ తహసీల్దార్ వీరన్నను ఫోన్ ద్వారా సంప్రదించగా, "ఓకే, కానీ నేను దంతాలపల్లి పైలెట్ ప్రాజెక్ట్‌లో ఉన్నాను... రూ.2,000 ఇస్తేనే డాక్యుమెంట్ ఇస్తాను" అని షరతు పెట్టారు. అంత డబ్బు తనకు కుదరక లాలు, "ఓ వేయి ఇస్తాను" అని ప్రాధేయపడ్డాడు. కానీ, అనంతరం కాల్ కట్ అయింది. ఈ క్రమంలో, రికార్డు అసిస్టెంట్ నాగరాజు రూ.1300 ఇవ్వమని సూచించడంతో, లాలు ఫోన్ పే ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ చేశాడు. కానీ ఆశించిన లింక్ డాక్యుమెంట్ బదులు, నాగరాజు డోర్నకల్ పట్టణం డాక్యుమెంట్‌కి బదులు ఉయ్యాలవాడ డాక్యుమెంట్ (డీటీ వీరన్న సంతకంతో) ఇచ్చాడు. పరిశీలించిన లాలు అది తప్పని గ్రహించి తిరిగి నాగరాజుకు 24 పేజీల డాక్యుమెంట్ తిరిగి అప్పగించాడు.

### కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్..

లాలు మీడియా ముందు తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పాడు. నాగరాజును ప్రశ్నించగా, "అవును, రూ.1300 తీసుకున్నది నిజమే. సోమవారం తిరిగి రూ.800 ఇచ్చేశాను. ఇది మా అధికారుల సూచన మేరకే జరిగింది" అని వివరణ ఇచ్చాడు. కానీ డిప్యూటీ తహసీల్దార్ వీరన్న మాత్రం తనకు అసలు విషయం తెలియదంటూ చేతులు దులిపేశారు. ఇప్పుడు, ఈ డబ్బు ఎవరికి వెళ్లిందన్నది గుర్తించాల్సిన బాధ్యత ఉన్నత అధికారులపై ఉంది. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ, సేవల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్న వాస్తవం ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. రెవెన్యూ శాఖ, జిల్లాలో అత్యంత అవినీతి పాలిత విభాగంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ విచారణ చేసి అవినితీ అధికారులపై చర్యలుత తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# గుండేటికి మాజీ ఎమ్మెల్యే వన్నాల పరామర్శ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ పూర్వ చైర్మన్ గుండేటి నరేంద్ర కుమార్ ను ఆయన నివాసంలో వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు సోమవారం పరామర్శించారు .డబ్బులు అడిగితే ఇవ్వలేదని అక్కసుతో 20వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ చెందిన ఒక మహిళ నాయకురాలు ఆదివారం ఆయన నివాసానికి వచ్చి మాట్లాడే పని ఉందని చెప్పి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయడంతో గుండేటి నరేంద్ర కుమార్ ను మిల్స్ కాలనీ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పొద్దంతా అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం చివరకు ఆదివారం రాత్రి గుండేటి నరేంద్ర కుమార్ ను పోలీసులు వదిలిపెట్టారు. గుండేటి నరేంద్ర కుమార్ అరెస్ట్ వరంగల్ నగరంలో సంచలనం సృష్టించింది. పద్మశాలి సామాజిక వర్గం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గుండేటి నరేంద్ర కుమార్ ను పోలీసులు అరెస్టు చేసిన విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలిసిన వెంటనే వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు హుటాహుటిన మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ చేరుకుని జరిగిన విషయాన్ని తెలుసుకుని, వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, మిల్స్ కాలనీ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రత్నంలను నేరుగా కలిసి తన పూచీకత్తుపై విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ విచారించిన అనంతరం వదిలి వేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత మిల్స్ కాలనీ పోలీసులు సుదీర్ఘంగా విచారణ చేపట్టి చివరకు గుండేటి నరేంద్ర కుమార్ ను ఆదివారం రాత్రి వదిలి పెట్టారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు సోమవారం గుండేటి నరేంద్ర కుమార్ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల శ్రీరాములు, సీనియర్ జర్నలిస్ట్ సదానందం నేత, పద్మశాలి సంఘం నాయకులు వన్నాల భాస్కర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ను ఒక రోజంతా అదుపులోకి తీసుకుని నిర్బంధించడాన్ని ఖండించారు.








# అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా కాళేశ్వరాన్ని తీర్చిదిద్దాలి

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- పుష్కర స్నానమాచరించిన బండి దంపతులు



**వరంగల్ వాయిస్, కాళేశ్వరం :** కాళేశ్వరాన్ని అద్భుతమైన అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. సోమవారం బండి సంజయ్ కుమార్ దంపతులు కాళేశ్వరంలో పుష్కర స్నానమాచరించి ముక్తేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కుంభమేళాలో 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిధ్యమిచ్చామని తెలిపారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారని, అట్టి నిధులు సరిపోవని ఇంకొన్ని నిధులు కేటాయించాలన్నారు. కుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన ఆతిధ్యమిచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. సోమవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి బండి అపర్ణతో కలిసి కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య బండి సంజయ్ దంపతులు సరస్వతి నదీమ తల్లి పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుంచి నేరుగా సరస్వతి మాతను, శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఈరోజు కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉందని, గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమని, 12 ఏండ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉందని అన్నారు. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులందరి కోర్కెలు తీరాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నానని అన్నారు. కాళేశ్వరం చాలా పవర్ ఫుల్ ప్లేస్ అని తెలిపారు. కాళేశ్వరంను అద్భుతమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నానని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com